క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలికి అభినందన



సంధ్యకు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన మాటూరి సంధ్యను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం తన నివాసంలో అభినందించారు. ఆమెకు సీట్ తినిపించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తానని సంధ్య పేర్కొన్నారు. తన గెలుపు కోసం ఆన్‌లైన్‌లో ఓట్లు వేసిన యువతకు, ప్రోత్సహించిన ఎమ్మెల్యే విజయరమణారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'శాతవాహన' సహాయ ఆచార్యుడికి డాక్టరేట్



క్రాంతిరాజు

ఓదెల: శాతవాహన విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల సహాయ ఆచార్యుడు, ఓదెల మండలం ఉప్పరపల్లికి చెందిన పల్లె క్రాంతిరాజు ఆదివారం డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ ఆచార్యుడు జె. కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఎఫెక్ట్ ఆఫ్ మొమోర్డికా చారన్షియా ఆన్ ఫార్మకో కైనెటిక్స్ అండ్ ఫార్మకో డైనమిక్స్ ఆఫ్ ఓరల్ హైపొగ్లైసిమిక్ డ్రగ్స్ ఇన్ డయాబెటిక్ ర్యాట్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. క్రాంతిరాజును శాతవాహన వీసీ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్ వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిశోర్, ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీశైలం, అధ్యాపకులు అభినందించారు.

తండ్రిని కోల్పోయిన చిన్నారికి చేయూత

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాకు చెందిన వివక్షిత అనే చిన్నారికి గ్రామ మాజీ సర్పంచ్ రాజునాయక్ దంపతులు చేయూతనిచ్చారు. గ్రామానికి చెందిన అలోత్ రాజు–సునీత దంపతులకు ఇద్దరు కూతుళ్లు సంశిత, వివక్షిత ఉన్నారు. రాజు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ క్రమంలో ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు మాజీ సర్పంచ్ ముందుకు వచ్చారు. చిన్నారి వివక్షిత పేరిట తపాలా శాఖలో సుకన్య సమద్ధి యోజన పథకం ఖాతా ప్రారంభించారు. ఏడాదికి రూ.8 వేల చొప్పున 15 ఏళ్లపాటు ఆ ఖాతాలో జమ చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత పత్రాలను ఆదివారం గ్రామస్తుల సమక్షంలో పాప తల్లి సునీతకు అందజేశారు. కార్యక్రమంలో పూల్‌చంద్, సమ్మయ్య, శామ్యూల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

సుల్తానాబాద్: సుద్దాలకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంకనపల్లి లక్ష్మయ్యను ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకరయ్య తెలిపారు. ఆదివారం సుల్తానాబాద్‌లో అంబేడ్కర్ యువజన సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, ఆయనకు నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు లక్ష్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సివిల్ రైట్స్ డే

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లిలో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎండీ.వకీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, అంబేడ్కర్ సంఘాల నాయకులు సకాలంలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

నేడు రుక్మిణీ కల్యాణం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ మద్భాగవత ప్రవచానాలు, శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సోమవారం రుక్మిణీ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు మౌలిక సదుపాయాల ఏర్పాటుతోపాటు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. శ్రీ మద్భాగవత ప్రవచకులు రామ్మోహన్‌రావు, ఆలయ అర్చకుడు నవీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మాజీ ఉపసర్పంచ్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ఓదెల: ఉప్పరపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు కనుకుంట్ల శ్రీనివాస్(42) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనకు వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం చనిపోయాడు. మృతుడు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత గీట్ల ముకుందరెడ్డికి ముఖ్య అనుచరుడు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే

- ఎలిగేడు మండలంలో 3,500 అర్జీల పరిశీలన పూర్తి
- వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- మొత్తం దరఖాస్తులు 5,499



ముప్పిరితోటలో సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో ఆరిఫ్

ఎలిగేడు: మండలంలో 10 రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తున్నారు. పథకం కింద మొదటి దశలో నిరుపేదలను ఎంపిక చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందిరమ్మ యాప్‌ను రూపొందించింది. గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 06 వరకు ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల కోసం మొత్తం 5,499 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు అర్జీదారుల ఇళ్లకు వెళ్లి, వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో ఆరిఫ్ సర్వే తీరును గ్రామాలకు వెళ్లి, పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు 3,500 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఇళ్లను జీపీఎస్‌తో లింక్..

లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు సొంతమా? అద్దెనా? ఏ రకమైన కట్టడం తదితర వివరాలు తెలుసుకుంటున్నారు. రేకుల షెడ్డు, స్లాబ్ (బిల్డింగ్), గూన(పెంకుటిల్లు) ఇల్లు, ఇంటి స్థలం ఉంటే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, ఇంటి బయట, పైకప్పు, లోపలి ప్రాంతాలను జీపీఎస్‌తో లింక్ చేసి, ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తున్నారు.

మహిళల పేరిట మంజూరు..

సర్వే పూర్తయ్యాక అధికారులు జాబితాను ఇందిరమ్మ కమిటీలకు అప్పగిస్తారు. సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వం మహిళల పేరిట ఇళ్లను మంజూరు చేస్తుంది. పెద్దపల్లి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లను మంజూరు చేయనుంది. సొంత స్థలం ఉండి, అసలే ఇల్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ప్రభుత్వం రూ.5 లక్షలను మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.

మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సెంటినరికాలనీలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని పార్టీ మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాటం సత్యం, నాయకులు తోట చంద్రయ్య, చిందం మహేశ్, బర్ల శ్రీనివాస్, బండారి సదానందం, బంక్ మల్లేశ్, మద్ది రాజ్‌కుమార్, ఉడుత శంకర్, ముచ్చకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలిదానానికి గుర్తు.. 'వీర్ బాల్ దివస్'



నివాళి అర్పిస్తున్న సంధ్యారాణి, నాయకులు

జ్యోతినగర్: బలిదానానికి గుర్తు వీర్ బాల్ దివస్ అని, దేశ చరిత్రలో ఒక అపూర్వ అధ్యాయాన్ని గుర్తు చేస్తుందని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని సిక్‌వాడీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురుగోవింద్ సింగ్ కుమారులు జోరావర్ సింగ్, ఫతే సింగ్‌ల చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. గురు గోవింద్ సింగ్ కుమారుల బలిదానానికి గుర్తుగా ఏటా వీర్ బాల్ దివస్ జరపనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారని తెలిపారు. నేటి బాలలు సైతం వారి స్ఫూర్తితో జీవితంలో ముందుకుసాగాలని సూచించారు. మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్, నాయకులు తోట కుమారస్వామి, ఆశిష్ అగర్వాల్, విక్రమ్ ఆదిత్య, సదానందం, పల్లికొండ నర్సింగ్, ప్రకాశ్, రఘుసింగ్, అజిత్‌సింగ్ తదితరులున్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న రామ్మూర్తి, పక్కన నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలపై టీబీజీకేఎస్ పోరాటం చేస్తోందని ఆ యూనియన్ వర్కింగ్ ప్రసిడెంట్ మాదాసి రామ్మూర్తి తెలిపారు. ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలోని కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్‌ను సాధించి, యువ కార్మికులకు అండగా నిలిచామన్నారు. తద్వారా కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత తమ సంఘానికే దక్కిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడంతో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బొగ్గు గనులను ప్రైవేటుపరం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలకు మద్దతు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కార్మిక సమస్యల పరిష్కారం, హక్కులను కాపాడేందుకు చిత్తశుద్ధితో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జీడీకే–11 గని ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వాసర్ల జోసెఫ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా చంద్రు శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శులుగా పల్లె సురేందర్, సాయిచరణ్ ఎన్నికయ్యారు. కేంద్ర కార్యదర్శి మోదుంపల్లి రాజేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, కేంద్ర అధికార ప్రతినిధి పర్లపెల్లి రవి, డివిజన్ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, కేంద్ర కోశాధికారి ఎల్.వెంకటేశ్, చెల్పూరి సతీశ్, కోంద్ర అంజయ్య, పర్లపెల్లి అభిషేక్, బొగ్గుల సాయి, మీస రాజు తదితరులు పాల్గొన్నారు.

'డీటీఎఫ్' ఆత్మీయ సమ్మేళనం



పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని ప్రముఖ పర్యాటక క్షేత్రమైన శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) నాయకులు, టీచర్లు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని వివిధ పాఠశాలల్లో ప్రస్తుతం పని చేస్తున్న, గతంలో పని చేసిన యూనియన్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణపై చర్చించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి డీటీఎఫ్ సేవలను వివరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి, రోజంతా సరదాగా గడిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు భూమయ్య, రవీందర్‌కుమార్, మొయినొద్దీన్, మల్లయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంకిషన్ రావు, సంతోష్‌రెడ్డి, కానుగంటి రాజమౌళి, దాదాపు 80 మంది టీచర్లు పాల్గొన్నారు.

'అక్రమ కేసులు పెట్టినందుకా సన్మానం?'



మాట్లాడుతున్న సత్యనారాయణ గౌడ్

రామగిరి: కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లో తమపై అక్రమ కేసులు పెట్టినందుకు పోలీసులకు సన్మానం చేశారా అని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం సెంటినరికాలనీ బుద్దె సత్యనారాయణ భవన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు అధికారులు కాంగ్రెస్ నాయకుడి ఇంటికి వెళ్లి, సన్మానం చేసుకోవడంపై తాము ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. అధికార బలంతో, పోలీసుల అండతో తమ నాయకుడిపై ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పదేళ్లుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేస్తున్న నువ్వు కార్పొరేషన్ పదవి కోసం మా నాయకుడిని విమర్శించడం మానుకోవాలని సూచించారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు కుమార్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, నాయకులు కొండవేన ఓదెలు, మేడగోని రాజన్న, ఆసం తిరుపతి, గద్దల శంకర్, మట్ట రాజు, కాట అనిల్, సాకేత్, బండి మహేందర్ పాల్గొన్నారు.

మహా పడిపూజ



యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి మహా పడిపూజ కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి అద్దెంకి సారంగచారి ఆధ్వర్యంలో 18వ సారి మాల ధరించి, నారికేళ స్వామిగా శబరిమల వెళ్తున్న వంగర లింగమూర్తి, వారి కుటుంబసభ్యులతో కలిసి 18 మెట్లకు పూజలు జరిపారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, సభ్యులున్నారు.

ఆర్జీ–3 రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనం



రామగిరి: ఆర్జీ–3 ఏరియా రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సెంటినరికాలనీలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు హాజరై, మాట్లాడారు. ఇలాంటి సమావేశం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. పలు డిమాండ్లను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు తీర్మానం చేశారు. విశ్రాంత ఉద్యోగి లేదా అతని భార్య మృతి చెందితే ప్రతీ ఒక్కరు రూ.100 ఆర్థికసాయం అందజేయాలని, ఆర్జీ–3 ఏరియాలో రెస్ట్ హాల్ నిర్మించాలని, ప్రతీ ఒక్కరికి 150 గజాల ఇంటి స్థలం, ప్రతీ ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్‌ను విశ్రాంతి ఉద్యోగులకు కేటాయించాలని, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరారు. నిర్వాహకులు గౌతం శంకరయ్య, సురభి ప్రసాద్, వేగోలపు మల్లయ్య, రాజసమ్మయ్య, బెండె ధర్మయ్య, శేషగిరి, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

'దానాల్లోకెల్ల అవయవదానం గొప్పది'



అభినందన పత్రం ఇస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ: దానల్లోకెల్ల అవయవదానం గొప్పదని సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన దాసారపు మోహన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేయడంతోపాటు మృతదేహాన్ని గోదావరిఖని సిమ్స్‌కు దానం చేశారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన మృతుడి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ చిన్న కూతురు అశ్విని తన అవయవదానానికి అంగీకారం తెలిపింది. దీంతో వారు అభినందన పత్రం అందజేశారు. ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సాన రామకృష్ణా రెడ్డి తదితరులున్నారు.

పూలే, అంబేడ్కర్.. స్ఫూర్తి ప్రదాతలు



జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ప్రపంచానికి జ్ఞానం అందించిన మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సకల జనులకు స్ఫూర్తి ప్రదాతలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, కేంద్ర కమిటీ నాయకుడు నూనె కొమురయ్య అన్నారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం గోదావరిఖని పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. ట్రస్ట్ చైర్మన్ నాతరి రాయమల్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు, సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బూడిద రాజయ్య, ఆలయ ఫౌండేషన్ సభ్యుడు ఆర్నకొండ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా రాజేశం

ధర్మారం: అంబేడ్కర్ యువజన సంఘం ధర్మారం గ్రామ అధ్యక్షుడిగా కాంపెల్లి రాజేశం ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుగా కాంపెల్లి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా జేరిపోతుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బొల్లి సూర్యచరణ్, సంయుక్త కార్యదర్శిగా ముల్కకాల రవి, కోశాధికారిగా బోయిని రాజ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా సుంచు ధనియాలు ఎన్నికయ్యారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న తహసీల్దార్ రవీందర్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ అంగోతు రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. అంతర్గాం, పాలకుర్తి మండలాల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. పాలకుర్తి మండలంలోని బామ్లానాయక్ తండా జట్టు ప్రథమ, అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లి జట్టు ద్వితీయ, అంతర్గాం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు అంతర్గాం తహసీల్దార్ తూం రవీందర్ చేతులమీదుగా ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రవినాయక్, వైస్ చైర్మన్ సాయికిరణ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీకాంత్, కోల ప్రణీత్‌గౌడ్, బడికెల మహేశ్, మాడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కోల రామ్మూర్తిగౌడ్, మాడ నారాయణరెడ్డి, పనగంటి సత్యనారాయణ, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



ఎలిగేడు: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల సమావేశం నిర్వహించారు. సమితి జిల్లా ఇన్‌చార్జి మంథని చందు, ఎలిగేడు మండల ఇన్‌చార్జి అంబాల నరేశ్‌ల ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాసంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బాసంపల్లి వినోద్, జల్లి రమేశ్, మల్లారపు మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కవ్వంపెల్లి సంపత్, అధికార ప్రతినిధిగా ఆసంపెల్లి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కవ్వంపల్లి బాపయ్య, న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి రాజేశం, కవ్వంపల్లి నారాయణ, తాండ్ర అంజయ్య, కవ్వంపల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

జూలపల్లి: బాలరాజుపల్లెలో పురాతన పోచమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి గ్రామ పెద్దలు ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన దాతలు, పెద్దపల్లిలో నివాసం ఉండే బూత్కూరి రాయమల్లు, పోచమల్లు, వెంకటేశ్, నర్సింగ్, తిరుపతిలు ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, రాజయ్య, జనార్దన్ తదితరులున్నారు.

విహారయాత్రలో తారుపల్లి విద్యార్థులు



గోల్కొండ కోట వద్ద విద్యార్థులు, టీచర్లు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఆదివారం విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. విహారయాత్రలో విద్యార్థులు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకుంటారని తెలిపారు. హైదరాబాద్ బిర్లామందిర్, గోల్కొండ కోట, చార్మినార్, సైన్స్ మ్యూజియం, ప్లానిటోరియం, నూతన సచివాలయం, ట్యాంక్‌బండ్, అంబేడ్కర్ విగ్రహం, తెలంగాణ అమర వీరుల స్తూపం, యాదాద్రిలోని స్వర్ణగిరి ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించినట్లు పేర్కొన్నారు. ఈ యాత్రపై పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సత్యప్రకాశ్‌రావు, శ్రీనివాస్, స్వరూప, రమాదేవి, ఆగయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాపి సంఘం కేలండర్ ఆవిష్కరణ



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్‌లో ఎల్లాపి సంఘం గోదావరి యూనిట్ కేలండర్–2025ను జెమిని ఆస్పత్రి ఎండీ చందా మురళిమనోహర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో ప్రతీ ఒక్కరు కొత్త ఆలోచలతో ముందుకుసాగాలని సూచించారు. ఎల్లాపి సంఘం రాష్ట్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ చందా రాజాకిషన్ రావు, యూనిట్ గౌరవ అధ్యక్షుడు పుప్పాల విక్రమ సింహారావు, ప్రెసిడెంట్ ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జియో డైరీ, కేలండర్..



గోదావరిఖనిటౌన్: బాలికల ఇస్లామీ సంస్థ(జియో)–2025 డైరీ, కేలండర్‌లను ఆదివారం గోదావరిఖని పట్టణంలోని జమాతే–ఇస్లామీ–హింద్ యూనిట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సంస్థ గోదావరిఖని యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా సాజిదా షేక్, ఆసియా బేగంలను ఎన్నుకున్నారు. మేరేజ్ అహ్మద్, ఖాజీ మహమ్మద్, ఇస్మాయిల్ నిజామీ, ముస్తఫా, సబూసారా, నిదాతౌసిక్, హుస్నా తక్రీమా, అథియా షగిప్తా తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లకు.. ఒక్కచోటకు



శారదా విద్యానికేతన్‌లో టీచర్లతో పూర్వ విద్యార్థులు

కమాన్‌పూర్: జూలపల్లి శారదా విద్యానికేతన్ పాఠశాలలో 2006–2007 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు చదువుకున్న పాఠశాలే వేదికైంది. 18 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో వారు భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, నవ్వుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లను సత్కరించారు. అందరూ కలిసి భోజనం చేసి, గ్రూప్ ఫొటో దిగారు.